తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## చిద్రూపే పరదేవతా భగవతీ శ్రీ రాజరాజేశ్వరీ...!



**-ముగిసిన దసరాఉత్సవాలు**

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 13 ప్రభాతవార్త శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మ ఆలయంలో శరవన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. చండీ, గణపతిహోమాల ప్రాముఖ్యతను తెలుపుతూ వేదపండితులు హోమ కార్యక్రమాలను నిర్వహించారు. వాయల్పాడు మండలం జర్రావారిపల్లికి చెందిన రఘురామిరెడ్డి, శ్రీదేవిలు దసరా ఉభయానికి రూ. 1,01,116లు చెల్లించారు. వంశీప్రియ, సౌమిత్‌రెడ్డిలు ఉభయాదారులుగా వ్యవహరించారు. వారికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఇఓ ఉప కమీషనర్ ఏకాంబరం, అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

# లక్కెవరికో!

- నేడు మద్యం దుకాణాల ఖరారుకు లక్కీ డిప్
- 104 మద్యం దుకాణాల కోసం 2,255 మంది ఆశావాహులు
- ఆర్ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు
- దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.45 కోట్లు ఆదాయం



ఆర్ఆర్ గార్డెన్స్‌లో మద్యం షాపుల ఖరారు ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు

చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:
జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణ నిర్వాహకులు ఎవరనే విషయం సోమవారం ఖరారు కానుంది. చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుండి మద్యం దుకాణాల ఖరారు కోసం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ నిర్వహించడానికి ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఎక్సైజ్ పాలసీని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి దాని స్థానంలో మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు ఖరారు చేయడానికి నూతన ఎక్సైజ్ పాలసీని ఖరారు చేసింది. జిల్లాలో రెండు సంవత్సరాల పాటు అమలులో వుండనున్న ఈ నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులను నిర్వహించి లాభాలు పొందనున్నారు. జిల్లాలో కొత్త ఎక్సైజ్ పాలసీ మేరకు 104 మద్యం షాపులను ఖరారు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తే ఈ షాపులను చేజిక్కించుకోవడానికి 2,255 మంది మద్యం దుకాణ వ్యాపారులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో పలమనేరు, పుంగనూరు, నగరి నియోజకవర్గాల్లో మద్యం షాపుల కైవసం చేసుకోవడానికి ముందే దుకాణ వ్యాపారులు సిండికేట్ కావడంతో ఈ నియోజకవర్గాల నుండి తక్కువ మంది మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఇక చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో మద్యం దుకాణ వ్యాపారులు ముందు దరఖాస్తు చేసుకుని ఆపై షాపు కైవసం చేసుకున్న వారితో సర్దుబాటు చేసుకోవడానికి ప్రయత్నాలు చేయాలని నిర్ణయించి ఎవరికి వారు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సైతం ఇదే తరహా ఆలోచనలో వుండటంతో ఇక్కడ మద్యం షాపుల కోసం భారీగా దరఖాస్తులు పడినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల ఖరారు లక్కీ డిప్‌ను చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్ వేదికగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయించడంతో ఈ మేరకు ఆర్ఆర్ గార్డెన్ పరిసరాల్లో ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆర్ఆర్ గార్డెన్ లోపలికి మద్యం షాపులను కైవసం చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్న ఆశావాహులను మాత్రమే అనుమతించనున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఒకొక్క షాపుకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన నెంబర్ గల బిళ్ళను కేటాయిస్తారు. ఒక షాపు పరిధిలో ఎన్ని దరఖాస్తులు వున్నాయో అన్ని నెంబర్లతో వున్న బిళ్ళలను కులుకు వేసి అందులో నుండి ఒక చీటి తీస్తారు. ఆ చీటిలో వున్న నెంబర్ దరఖాస్తుదారుడికి మద్యం షాపు ఖరారైనట్లు ప్రకటిస్తారు. ఒకవేళ మొదటి సారి వచ్చిన నెంబర్ కల్గిన వ్యక్తి ప్రభుత్వం నిర్ణయించిన లైసెన్సు ఫీజు చెల్లించకుంటే రెండవ సారి డిప్ వేసి మరొక చీటి ఎత్తి ఆ షాపులో రెండవ సారి డిప్‌లో వచ్చిన మద్యం దుకాణదారుడికి ఖరారు చేస్తారు.

**మద్యం దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.45 కోట్లు ఆదాయం**

చిత్తూరు జిల్లాలో మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడానికి నిర్ధేశించబడిన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి 45.10 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. జిల్లాలో 104 మద్యం షాపుల కోసం ఎక్సైజ్ శాఖ ఆన్‌లైన్‌లో మద్యం దుకాణ వ్యాపారుల నుండి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు జిల్లాలో ప్రైవేటు మద్యం షాపులను చేజిక్కించుకోవడానికి పెద్ద ఎత్తున మద్యం దుకాణ వ్యాపారులు ముందుకు వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో మద్యం దుకాణ వ్యాపారులు సిండికేట్ కావడంతో ఈ నియోజకవర్గాల నుండి ప్రభుత్వానికి కొంత మేరకు ఆదాయం తగ్గింది.

## లక్కీ డిప్ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

మద్యం షాపుల ఖరారు కోసం చిత్తూరు సంతపేట ఆర్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించనున్న లక్కీ డిప్ ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌ను ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు కలిసి అక్కడ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 104 మద్యం షాపుల ఏర్పాటు కోసం 2,266 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీరికి ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు లక్కీ డిప్ నిర్వహించి ఎంపికైన మద్యం దుకాణదారుడికి మద్యం షాపును కేటాయించడం జరుగుతుందన్నారు. చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుండి మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించి లక్కీ డిప్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు.

# వైభవంగా చక్రస్నానం



తిరుమలలో శనివారం ఉదయం వైభవంగా చక్రస్నానం దృశ్యం



తిరుమలలో కన్నుల పండుగగా 'భాగ్' సవారి

### నేడు తిరుపతి జిల్లాకు
## భారీ వర్ష సూచన




తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త
అల్పపీడనం, తుఫాను ప్రభావం వల్ల రాబోయే 4 రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం తిరుపతి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ ఎస్పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ అధికారులతో సమావేశమైన కలెక్టర్, భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు, నాలుగు రోజులు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, తుపాను వచ్చినట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు కలెక్టర్ కార్యాలయంలో నిరంతరం పనిచేసేలా కంట్రోల్ రూమ్ 08772236007కు సమాచారం కొరకు, అత్యవసర పరిస్థితుల్లో కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల హెచ్చరికలు నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

### చిత్తూరులో

చిత్తూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త



చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికార యంత్రాంగంను అప్రమత్తం చేశారు. జిల్లాలో వర్షాలకు సంబంధించి ఎదైనా ఆపద పరిస్థితులు తలెత్తితో ప్రజలను సురక్షితంగా వుంచడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వర్షాలకు సంబంధించి ఎదైనా సమాచారం వుంటే ప్రజలు సత్వరం 94910 77356 నెంబర్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. జిల్లాలో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం కన్పిస్తుండటంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, నష్ట నివారణకు తీసుకోవాలల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరుగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారుల నుండి మండల స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా వుండి విధులు నిర్వర్తించాలని, అధికారులు వారి ప్రధాన కార్యస్థానాల్లో అందుబాటులో వుండాలని స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యే చేతులు మీదుగా
## చెంగాళమ్మకు సారె



సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త
సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా శనివారం రాత్రి అమ్మణ్ణికి సారె సమర్పించారు. ఆలయానికి వచ్చిన విజయశ్రీ, పార్థసారధి దంపతులకు దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో శ్రీచెంగాళమ్మ చెట్టు వద్దకు చేరుకొని అక్కడ పూజలు చేసిన అనంతరం త్రిశూలం వద్ద అమ్మణ్ణికి పూజలు చేశారు. గర్భాలయంలోకి వెళ్లి భక్తిపూర్వకంగా అమ్మణ్ణికి చీర పసుపు కుంకుమ సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మాధవనాయుడు, ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధ పూజ నిర్వహించిన ఎస్పీ మణికంఠ చందోలు



చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:
విజయదశమిని పురస్కరించుకుని శనివారం ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా ఎఆర్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆయుధ కారాగారము, పోలీసు క్యాంటీన్, జిమ్, పోలీసు అసోసియేషన్ ఆఫీసు, మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాలకు ఎస్పీ మణికంఠ చందోలు ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ పోలీసు బలగం ఎల్లప్పుడు ప్రజల రక్షణ కోసం తుపాకులను క్రమశిక్షణతో వాడుతుందన్నారు. విజయదశమి పర్వదినం చెడుపై మంచి విజయం సాధించడానికి ప్రతీక అని, ఈ సందర్భంగా సాయుధ పోలీసు కార్యాలయంలో చేసిన ఘనమైన ఏర్పాట్లను ప్రశంసిస్తూ ఈ కార్యకమంలో పాల్గొన్న సాయుధ దళ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## శోభాయమానంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మొదటి సారి దసరా ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు పార్వేట ఉత్సవాన్ని ఈ ఏడాది విన్నూత్న రీతిలో నిర్వహించారు. విజయదశమి రోజు రాత్రి పట్టణంలో పార్వేట ఉత్సవాన్ని 'శోభాయాత్రగా' నిర్వహించారు. మొదటి సారి అమ్మవారి వివిధ రూపాల్లో వేష ధారణలతో ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తిచరిత్రలో మొదటి ఉత్సవాలతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ పాల్గొన్నారు. ఆయన కూడా ఓ కళాకారునిలా కళాకారులను ఉత్సహాపరుస్తూ కేరళ పంచవాయిద్యాలు, సంప్ర దాయ డోలు, సన్నాయి, తప్పెట్ల మోతతో సాగించారు. బోయిలో స్వామి అమ్మవార్లను మోసుకుంటూ రాజగోపురం నుంచి వాహనాల మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి పార్వేట ఉత్సవం శోభాయాత్రగా ప్రారంభం అయ్యింది. ఈ ఉత్సవంలో నిర్వాహాకుల అంచనాలకు అందని రీతిలో కళాకారులు, శ్రీకాళహస్తి, తిరుపతి నుంచి హాజరయ్యారు. కళాకారులు వారి సొంత ఖర్చులతో మెకప్‌లు చేసుకొని హాజరయ్యారు. మొదటి సారి పార్వేట ఉత్సవానికి స్పందన వచ్చింది. ఈ ఉత్సవంతో పాటు ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీహరి, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

## కూలిన పాఠశాల భవనం

**సెలవులు కావడంతో విద్యార్థులకు తప్పిన ప్రమాదం**

పాలసముద్రం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:
మరమ్మత్తులకు గురై శిధిలావస్థకు చేరిన ఓ పాఠశాల భవనం మండలంలో శుక్రవారం ఒక్కసారిగా కూలిపోయింది. పాఠశాల భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో గ్రామస్తులు వణికిపోయారు. పాఠశాలలకు దసరా సెలవులు కావడంతో విద్యార్థులెవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. పాలసముద్రం శ్రీబొమ్మరాజపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు వున్నాయి. ఇందులో ఒక గది శిధిలావస్థకు చేరడంతో ఉపాధ్యాయులు మరొక గదిలో విద్యార్థులకు విద్య బోధిస్తున్నారు. శుక్రవారం ఒక్కసారిగా పాఠశాల శ్లాబ్ కూలిపోవడంతో పాఠశాల భవనం ఒక్కసారిగా



కూలిపోయింది. సాధారణంగా సెలవు రోజుల్లో విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే ఆటలాడుకుంటుంటారు. అయితే శుక్రవారం పాఠశాల విద్యార్థులు ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ పాఠశాలలో గతంలో 20 మంది విద్యార్థులు చదువుతుండగా పాఠశాల భవన పరిస్థితిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 8 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకవేళ పాఠశాల నడుస్తున్న సమయంలో భవనం కూలిపోయి వుంటే పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఇకనైనా ప్రభుత్వ పాఠశాల్లో మంచి స్థితిలో వుండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**- ఐదుగురికి గాయాలు**

నాయుడుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త
నాయుడుపేట మండలం నరసారెడ్డికండ్రిగ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో అన్నమేడు గ్రామానికి చెందిన శాంతమ్మ (68) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అన్నమేడు గ్రామానికి చెందిన పలువురు సూళ్లూరుపేటలో ఆదివారం జరిగిన ఓ వివాహానికి ఆటోలో వెళ్లారు. తిరిగి ఇంటికి చేరే క్రమంలో నరసారెడ్డికండ్రిగ గ్రామం వద్ద వెనుక వైపు చెన్నై నుంచి నెల్లూరు వెళుతున్న కారు ఢీకొంది. ఈ రోడ్డు ప్రమాదంలో శాంతమ్మ మృతిచెందగా, డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. శాంతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం

**టిటిడి ఈవో జె. శ్యామలరావు**

తిరుమల, అక్టోబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి
శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు సామాన్య బక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందించినట్లు టిటిడి ఈవో జె. శ్యామల రావు చెప్పారు. టిటిడి సిబ్బంది సంయమనంతో ప్రణాళిక బద్ధంగా, సీనియర్ అధికారులు పర్యవేక్షణలో సేవలందించారని తెలిపారు. టిటిడి ఏర్పాటు చేసిన సౌకర్యంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఈవో, అదనపు ఈవో సిహెచ్ వెంచయ్య చౌదరితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో అక్టోబర్ 4 నుండి 11వ తేది వరకు శ్రీ వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 4వ తేదిన శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అక్టోబర్ 5వ తేది పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున రూ. 13.45 కోట్లతో నూతనంగా నిర్మించిన వకుళమాత వంటశాలను ప్రారంభించారు. ఆరు లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహన సేవలు వీక్షించారన్నారు. గరుడ సేవలో 82043 మంది దర్శించుకున్నారు. గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. ఏడు లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ విక్రయించిన మొత్తం లడ్డూలు 30 లక్షలు, హుండీ కానుకలు 26 కోట్ల రూపాయిలు, తలనీలాలు సమర్పించుకున్న భక్తుల సంఖ్య 2.6 లక్షల మంది, భక్తులకు 32713 గదులు కేటాయించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో 475 లక్షల గ్యాలన్ల నీటి వినియోగం చేసామన్నారు. కల్యాణవేదిక వద్ద వివిధ విభాగాల ద్వారా ఏర్పాటు చేసిన ఫల పుష్ప ప్రదర్శన నాడు నేడు కాన్సెప్ట్‌తో ఫోటో ఎగ్జిబీషన్, అటవీ, శిల్ప కళాశాలలచే ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి. తిరుమలలో పలు ప్రాంతాల్లో దేవతామూర్తులు విద్యుత్ కటౌట్లతో పాటు 32 పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసామన్నారు. ఇందులో నాలుగు మాడ వీధులలో 23, ప్రధాన కూడళ్ళలో 9 ప్రత్యేకంగా తిరుపతిలో 7 డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మోత్సవాల 8 రోజుల్లో 26 లక్షల భోజనాలు, అల్పాహారం అందించడమైందన్నారు. గరుడసేవ రోజు 8.71 లక్షల మందికి అన్నప్రసాదాలు, అల్పాహారం, 3.47 లక్షల మందికి టి, కాఫి, పాలు, బాదం పాలు, 4 లక్షల మజ్జిగ ప్యాకెట్లు, 4 లక్షల తాగునీరు బాటిళ్ళు, స్నాక్స్‌గా సున్నుండలు, బిస్కెట్లు అందించారు. సుమారు 45 మంది డాక్టర్లు, 60 మంది పారామెడికల్ సిబ్బందిని, 13 అంబులెన్సులు వినియోగించడమైంది. 68 వేల మందికి పైగా భక్తులు వైద్య సేవలు నిర్వహించారు. తిరుమలలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం 1365 మంది సిబ్బంది గరుడ సేవ రోజు అదనంగా 600 మంది సిబ్బంది ఏర్పాటు చేసామన్నారు. టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 18 రాష్ట్రాల నుండి వచ్చిన 261 కళాబృందాల్లో 6884 మంది కళాకారులు కళారూపాలను ప్రదర్శించారు. వాహన సేవలతో పాటు తిరుమల తిరుపతిలో ప్రదర్శించిన కళాకృతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు ఎంతో సంతోషించారు. శ్రీవారి ఆలయంతో పాటు పలు కూడళ్ళు, అతిథి గృహాల వద్ద శోభాయమానంగా పుష్పాల అలంకరణలు, పుష్ప ప్రదర్శన నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో 40 టన్నులు పుష్పాలు, 3.50 లక్షల కట్ ఫ్లవర్స్, 80 వేల సీజనల్ ఫ్లవర్స్ వినియోగించారు. రాంభగీచా 2లో మీడియా సెంటర్, కల్యాణ వేదిక వద్ద నాడు - నేడు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

## నేడు కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ స్థాయిలో సోమవారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ప్రజలనుంచి వినతులు సీ ్వకరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వి నియోగంచేసుకో వాలన్నారు.ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్ఎం విద్యార్థులకు ర్యాంకులు



**కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త** తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బికాం(సిఎ)లో తులసి 9.19/10, బిబిఎలో హీనాకౌసర్8.97, బిఎస్సీలో త్రిష 8.23శాతం మార్కులతో కుప్పం పట్టణ టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే మనీషా, సూర్యకళ, పవిత్ర, శ్వేత, జీవిత, సుమయతబసుం, ఆసిన్‌తాజ్‌లు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ ఘనంగా సత్కరించి అభినందించారు.

## విజయవాడలో 450 మంది వరదబాధితులకు నిత్యావసరాలు పంపిణీ



**కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త** కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు అధ్వర్యంలో విజయ వాడ వరద బాధితులు సుమారు 450మందికి ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దసరా పండగ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో బాధిత కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, నూతన వస్త్రాలు, చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. సుందరయ్య నగర్ కట్ట, ఎల్‌బిఎస్ నగర్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో జగదీష్‌బాబు ప్రజ లకు సాయం అందించారు. కుప్పం నియోజకవర్గంలో ఇటీవల ఆయన వరద బాధితుల కోసం ప్రజలనుంచి విరాళాలు సేకరించి విజయవాడకు తరలించి అక్కడ బాధితులకు అందించారు. ఈసందర్భంగా ఆయన కుప్పంలోని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పునీత్, అంజన్, ప్రసాద్, అశ్వత్, రమేష్ పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ప్రతిభ



**కుప్పంరూరల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త** ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని కాలేజ్ ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. బికా ం (సిఎ)లో వర్షిక 9.3శాతం, బిఎస్సీ(ఎంపిసిఎస్)లో భవాని 9.28,ఎంఎస్‌సిఎస్‌లో భువనేశ్వరి 8.78, బిజెడ్‌సిలో రేఖ 8.49, బిబిఎలో రాకేష్ 8.97 పాయింట్లు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్‌లో ఆరుమంది విద్యార్థులు 10/10పాయింట్లు సాధించారన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

## క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం



**శ్రీరంగరాజుపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. చిన్నతయ్యూరు గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన పిళ్ళారికుప్పం, గంగాధరనెల్లూరు బుక్కపట్నం జట్లకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదివారం ప్రథమ, ద్వితీయ బహుమతు లను అందజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి గెలుపొందిన పిళ్ళారికుప్పం జట్టు సభ్యులకు ఎమ్మెల్యే మొదటి బహుమతిగా రూ.40 వేలు అందజేయగా, ద్వితీయ స్థానం నిలిచిన గంగాధరనెల్లూరు బుక్కపట్నం క్రికెట్ జట్టుకు రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల దేశం అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, జిల్లా దేశం నాయకులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, కొత్తపల్లిమిట్ట తెలుగుదేశం నాయకులు సూరిరెడ్డి, ఆరిమాకులపల్లి గుడి ఉత్సవ కమిటీ సభ్యు లుహిమాచలపతిరెడ్డి, జలంధర్‌నాయుడు, హేమాద్రియాదవ్, స్థానిక క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

## కృపాలక్ష్మీ పుట్టినరోజు వేడుకలు

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి, కుమార్తె, జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీ పుట్టినరోజు వేడుకలను ఆదివాకం కొత్తపల్లిలో ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి వైకాపా యువత నాయకుడు పొన్నుస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పిల్లలు, పెద్దలు, మహిళలకు పంచి పెట్టారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కృపాలక్ష్మీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.వైకాపా నాయకులు ధరణి, శేషాద్రి, యాకుబ్, కనికరాజు,నీలమ్మ,మారియమ్మ,దొరవేలు, ధనంజయ, భరత్, ధనుష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుల వేతనాల పెంపుపై హర్షం



**చిత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** విజయవాడ అమరావతిలో మంత్రి నారాలోకేష్‌ను కలసి దేవాలయాలలో దూప, దీప, నైవేద్య పథకానికి రూ. 10వేలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని బ్రాహ్మణులు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారనీ తెలుపుతూ చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులు తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు నాయకులు ఎంజి రామభద్ర పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో నారాలోకేష్ ఇచ్చిన మాట ప్రకారం దూప, దీప, నైవేద్య సాయం కింద ప్రతినెల అర్చకుడి ఖాతాలో పది వేలు జమచేస్తారని అలాగే వేద విద్యను అభ్యసించే యువతకు యువనేస్తం కింద రూ.3వేలు చంద్ర బా బు ప్రభుత్వం సాయం అందిస్తుందనీ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహాపూర్ణహుతితో నవచండీయాగం విజయవంతం



**చిత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** చిత్తూరునగరం జిజెఎం సుఖీభవ కన్వెన్షన్ హాల్ నందు గత 9 రోజులుగా నిర్వహిస్తున్న నవచండీయాగంను శనివారం మహా పూర్ణా హుతి కార్యక్రమంతో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగ న్మోహన్ కుటుంబసభ్యులతో కలసి విజయవంతంగా పూర్తి చేసారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండా లనీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో సుపరిపాలన అందించాలని ఈ నవచండీ యాగాన్ని శరన్నవ రాత్రుల్లో భాగంగా తొమ్మిదిరోజుల పాటు స్వామిజీ శ్రీశ్రీశ్రీ బాలక్రిష్ణ గురుజీ, వారి శిష్యబృందం ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. అనంతరం యాగంకు తరలివచ్చిన 2000మంది మహిళలకు పసుపు, కుంకుమ, వెండిభరణిలను కానుకలుగా అందజేసారు.

## ఘనంగా తిరుపతి గంగమ్మకు పొంగళ్ళు

**వెదురుకుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** మండలంలోని పచ్చికాపల్లం పంచాయిత పరిధిలోని దాసరి కాలనీలో తిరుపతి గంగమ్మకు ఘనంగా పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవి నవరాత్రులు పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి వివిధ అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం గ్రామస్థులు ప్రత్యేకంగా పొంగళ్ళులు పెట్టి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుని భక్తులకు దైవ దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి కాలనీలోరి మహిళలు, పెద్దలు పాల్గొన్నారు

## దసరా మహోత్సవాల్లో భక్తుల సౌకర్యాలకు పెద్దపీట



**బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 13 ప్రభాతవార్త** శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించబడ్డ దసరా మహోత్సవాల్లో భక్తుల సౌక ర్యాలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు ఆలయ ఇఒ ఉపకమీషనర్ జె.ఏకాంబరం అన్నారు. ఆలయంలో ఈనెల 4నుంచి 12వరకు దసరా మహోత్సవాలు నిర్వ హించామనీ, ప్రతి రోజు విశేష సంఖ్యలో వచ్చిన యాత్రీకులకు అన్నదాన చేపట్టామన్నారు. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన వేళల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొన్నట్లు వివరించారు. దసరా మహో త్సవాలుదిగ్విజయంచేసిన వేదపండితులు, అర్చకులు, అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఈ వారం మంగళవారం నిర్వహించనున్నారు. మద్యం షాపుల కైవసంకు సోమవారం లక్కీ డిప్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీసులు బిజీ అయిన నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను మంగళవారం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరష్కార వేదిక నిర్వహణ భవనంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## రేపు పోలీస్ గ్రీవెన్స్

**చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ప్రతి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ వారం మంగళవారం నిర్వహించనున్నారు. సమస్యలపై జిల్లా కేంద్రానికి వచ్చి వినతిపత్రాలు సమర్పించే ప్రజలు మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు హాజరై తనకు సమస్యలపై వినతిపత్రాలు అందించాలని ఆయన కోరారు.

## నారా భువనేశ్వరి కుప్పం పర్యటన వాయిదా

**కుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన వాయిదా పడింది. ఈనెల 14నుంచి 17వతేది వరకు కుప్పం నియోజకవర్గంలో నారా భువనమ్మ పర్యటనను ఖరారు చేశారు. అయితే రాష్ట్రంలో 14వతేది నుంచి భారీ వర్ష సూచనలు ఉండడంతో పర్యటనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కుప్పం తెదేపా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవ రసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు నగరం మురకంబట్టు కోడిగుట్టకు చెందిన ఎ.మోతీష్ అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆన్‌లైన్ ద్వారా టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవికు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శ్రీగుర్రప్ప, వెంకటేశ్వరునికి ఘనగా గ్రామోత్సవం

**తవణంపల్లె, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** మండలంలోని జొన్నగురకల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగుర్రప్ప, వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తృతీయ వార్షికోత్సవ పూజల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. జొన్నగురకల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎ.కేశవులు ఆధ్వర్యంలో గుర్రప్ప, వెంకటేశ్వర ఆలయంను గత రెండేళ్ళ క్రితం నిర్మించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈమేరకు ప్రతి ఏటా ఆలయంలో వార్షికోత్సవ పూజలు కేశవులు కుటుంబీకులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వార్షికోత్సవ పూజలను అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో వేదపండితులు, రుత్వికులు విశ్వక్సే నారాధన, గణపతిపూజ, పుణ్యాహావాచనం, కలశ ప్రతిష్ట, అగ్నిప్రతిష్ట, ప్రత్యేక హోమాలు, పూర్ణాహుతి, నివేదన వంటి పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం పల్లకిపై వుంచి పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాత ఎ.కేశవులు, జొన్నగురకల పరిసర గ్రామాల ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**సదుం అక్టోబరు13ప్రభాతవార్త** మండల పరిదిలోని పలు అమ్మవారి ఆలయాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తాటి గుంటపాలెం పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలోని శ్రీశ్రీ ఎల్లమ్మ ఆల యంలో అమ్మవారిని భద్రకాళి అలంకరణ చేశారు. శనివారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్ట రులో ఉంచి గ్రామంలో ఊరేగించారు. మహిళలు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈఓఆర్‌డి వరప్రసాద్, ఆలయ ధర ్మకర్తలు వాసు, దాము, మధులు పాల్గొన్నారు.అదేవిధంగా సదుంలోని గ్రామ దేవత సదుమమ్మ ఆలయంలో అమ్మవారికి దసరా ఉత్సవాల అనంతరం ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పుష్పపల్లకిలో ఉంచి సదుం పట్టణంలోఊరేగించారు. జాండ్రపేట, మొరవ మీదపల్లెలోని శ్రీశ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయాలలోను, పచ్చారుమాకులపల్లె శ్రీశ్రీ గంగాపురమ్మ ఆల యంలోను దసరనవరాత్రి ఉత్సవలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్దిరెడ్డి కవితమ ్మ,పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, యర్రాతివారిపల్లె ఎంపీటీసీ శ్రీలత, రెడ్డెప్పరెడ్డి జక్కల రవి, శ్రీనివాసులు,పిచ్చుక కృష్ణయ్య, కృష్ణమూర్తి,కరంటు బాబు, ఉల్లిబాబు, సహదేవయ్య,హరినాద్ పాల్గొన్నారు.

## నేటి నుంచి పల్లెపండుగ కార్యక్రమాలు

**సదుం,అక్టోబరు13ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పల్లె పండుగ కార్యక్రమం ఈనెల 14 నుంచి 19 వరకు సదుం మండలంలోనిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు.14 వతేదీన 79ఏ చింతమాకులపల్లె,ఊటుపల్లె, 15న చింతలవారిపల్లె,పాలమంద,16న కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె,ొ ండ్డివారిపల్లె,17న అమ్మగారిపల్లె, 18న జోగివారిపల్లె, చెరకువారిపల్లె,19న తిమ్మానాయనపల్లె, నడిగడ్డ,తాటిగుంటపాలెం పంచాయతీలలో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.ఈ పంచాయతీలలో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు.

## నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**చిత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్లే రెండు నూతన హైయర్‌ఆర్టీసి బస్సులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శనివారం ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాకు 70 నూతన బస్సులను మంజూరు చేయడం జరిగిందనీ, ఇందులో భాగంగా చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్లడానికి బస్సులు తక్కువగా వుండడం ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తక్షణమే రెండు హైయర్ బస్సులను కేటాయించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని నూతన టెక్నాలజీతో కూడిన ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వసంత్‌కుమార్, ఆర్టీసి ఆర్ఎం జగదీష్, డిపోమేనేజరు రూపశ్రీ, ఇతర అధికారులు,

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వంద రోజుల్లో పోలేరమ్మ కళా తోరణం నిర్మాణం పూర్తి చేయిస్తాం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



**వెంకటగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త** వంద రోజుల్లో గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి కళాతోరణాన్ని పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద పోలేరమ్మ అమ్మవారి కళాతోరణం నిర్మాణంకి భూమి పూజ చేశారు. కురుగొండల్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద పోలేరమ్మ అమ్మవారి కళా తోరణం నిర్మాణంకి భూమి పూజ చేశారు. కురుగొండ్ల రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నిధులతో కళా తోరణాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి పట్టణంలోకి ఇతర ప్రాంతాల వారు ప్రవేశించిన వెంటనే పోలేరమ్మ అమ్మవారు గుర్తుకొచ్చే విధంగా ఆర్చ్‌ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, మాజీ పట్టణ అధ్యక్షుడు ఆనంద్, నాయకులు రామచంద్ర నాయుడు, చెంగారావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విష్ణుమూర్తి అలంకరణలో వెంకటేశ్వర స్వామి

**వెంకటగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



పట్టణంలోని హరిహర క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేతకళ్యాణవెంకటేశ్వరస్వామిఉత్సవమూర్తిమహావిష్ణువు అలంక రణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా దేవి అలంకరణంలో భక్తు లకు దర్శనం ఇచ్చిన కాత్యాయని అమ్మవారు. ఆలయంలో భక్తు లు ప్ర త్యేకపూజలునిర్వహించారు.తీర్థప్రసాదాలుభక్తులకు అంద జేశారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే

### దివ్యాంగులకు ట్రై సైకిల్లు పంపిణీ



**చిల్లకూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త** చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలో రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసరావు నాయుడు దాతృత్వంతో దసరా పండుగ సందర్భంగా శనివారం వాకడుకు చెందిన షేక్ బాబు, బత్త లాపురంను చెందిన తలారి రాజేంద్ర, ఎల్లసిరికి చెందిన దాసరి సుబ్రమణ్యం, పార్లపల్లికి చెందిన కుమార్‌లకు దివ్యాంగులకు ట్రై సెకిల్లు అలాగే పురిటిపాలెంకు జీవనాధారం కోసం తోపుడు బండిని ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటేశ్వర్లు నాయుడు, చంద్రయ్య నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు మోహన్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



**కోట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నెల్లూరు మోహన్‌రెడ్డి బాబాయ్ శ్రీనివాసులురెడ్డి మృ తిచెందారు. సమాచారం తెలుసుకున్న గూడూరు ఎ మ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కొత్తపాలెం గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి కన్వీనర్ సర్వోత్తమరెడ్డి, జిల్లా టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, ఎంపిటిసి సురేష్, అనిల్ ఉన్నారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కోట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** సోమవారం నుంచి వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఆదివారం మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. మరో 48 గంటల్లో ఇది మరింత బలపడే సూచనలున్నాయని పేర్కొన్నారు. ఆ మేరకు అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**కోట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభ్యర్థుల నుంచి డిఎస్సీ పరీక్ష కోసం ఉచిత సౌకర్యాలతో పాటు నెలరోజుల పాటు అభ్యర్థులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని కోట ఎంఇఓ దారా మస్తానయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం 2 లక్షల 50 వేల లోపు ఉన్న అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## స్వర్ణముఖి పొర్లు కట్ల పనులు పూర్తి చేయాలి

**వాకాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చే యాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశించారు. ఆదివారం సబ్ కలెక్టర్ నిర్మాణ పనులను పరిశీలించారు. తుఫాను వలన భారీ వర్షాలు, వరదలు సంభవిస్తాయని ఐఎండి హెచ్చరించడంతో భారీ వర్షాలు వరదలు వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు సబ్ కలెక్టర్ ఈ ప్రాంతానికి వచ్చి, అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గంగన్న పాలెం వద్ద స్వర్ణముఖి నది పొర్లు కట్టలకు గండ్లు పడే అవకాశాలు ఉన్నాయని తహశీల్దార్ రామయ్య సబ్ కలెక్టర్‌కు సూచించారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడిన సహాయక చర్యలు చేపట్టేందుకు ముందస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ రామయ్య, ఎంపిడివో అన్నపూర్ణరావు, ఇరిగేషన్ అధికారులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

- *ఉన్నత పాఠశాల పరిశీలన..* బాలిరెడ్డి పాలెం గ్రామంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు కింద జరిగిన పాఠశాల నిర్మాణం పనులను, మరుగుదొడ్లును సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. సంబంధించిన అధికారులు ద్వారావివరాలు అడిగి తెలుసుకున్నారు.

## షిరిడీసాయి ఆలయంలో లక్ష తమలపాకుల పూజలు

**సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని కస్వారెడ్డిపాలెంలో ఉన్న శ్రీషిరిడీ సాయి సత్సంగ మందిరంలో శరన్నవరాత్రులు ముగిం పు సందర్భంగా శనివారం రాత్రి లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడీ సాయిబాబా 106వ మహాసమాధి సందర్భంగా 108 కొబ్బరికా యల నీళ్లతో షిరిడీసాయికి అభిషేకాలు చేశారు. 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజలు చేశారు. సహస్ర నామాలతో సాయినాథునికి లక్ష తమలపాకుల పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి సత్సంగ మందిర్ సభ్యులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

**సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థుల సంఘం తర పున కృషి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిం చుకుంటున్నట్లు నూతనంగా ఎన్నికైన పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం షార్ మాజీ డైరెక్టర్, పూర్వపు కళాశాల విద్యార్థి అయి న కె.నారాయణ, మాజీ లెక్చరర్ రాంగోపాల్‌రెడ్డి అధ్యక్షతన పూర్వపు విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహించారు. మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వపు విద్యార్థుల సహకారం తీసుకోవాలని తీర్మా నించారు. పూర్వపు విద్యార్థుల సంఘం ద్వారా వివిధ విద్యాసంబంధ కార్యక్రమాల్లో సహకారం తీసుకొని అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు ప్రతి పూర్వపు విద్యార్థి సహ కారం అందించాలని, దీనికి తగ్గట్టుగా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేయాలని తీర్మా నించారు.షార్ మాజీ ఉద్యోగి ఎల్.శ్రీనివాసులు, ఆర్ఎం ఉమామహేశ్వరరావు, ఉస్మా న్‌బాషా, ఆదినారా యణరెడ్డి, డాక్టర్ అనురాధ, వీరయ్య, శివకుమార్‌రెడ్డి, సురేష్, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంతాల్లో సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన

**కోట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా తీరప్రాంత గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పుచ్చలపల్లి గ్రామంలో స్వర్ణముఖి నది పొర్లుకట్టలను పరిశీలించారు. అక్కడి నుంచి గోవిందుపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ ప్రజ లతో మాట్లాడారు. తుపాను వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సురక్షిత తరలి వెళ్లాలని కోరారు. అనంతరం కొత్తపాలెం, కొత్తపట్నం గ్రామాలకు వెళ్లారు. ఆయన వెంట తహశీల్దార్‌జయజయరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఎంపిడిఓ వేణు, ఇతర అధికారులు ఉన్నారు.

## శ్రీ వేంకటేశ్వరునికి రత్నాంగి అలంకారం



**సూళ్లూరుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త** సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీమద్వేంకట రామ్మూర్తి దేవస్థానంలో పెరటాశి నెల నాలుగో శనివారాన్ని పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామికి శ్రీరత్నాంగి అలంకారాన్ని చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.పట్టణ టిడిపి అధ్యక్షులు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఎసి కిషోర్, బీరక రాంబాబు, మాదరపాక సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ ఛైర్మన్ 786 రఫీకి పితృవియోగం

**నాయుడుపేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త**



నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ 786 రఫీకి పితృవియోగం కలిగింది. 786 రఫీ తండ్రి షేక్ చాన్‌బాషా పార్థివదేహాన్ని రఫీ నివాసం వద్ద ఉంచారు. సమాచారం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు. అలాగే పట్టణంలోని పలు మసీదుల మతపెద్దలు, మార్కెట్ దుకాణదారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ చాన్‌బాషా మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

## వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించిన తహశీల్దార్

**దొరవారిసత్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



దొరవారిసత్రం మండల పరిధిలోని లోతట్టు వరద ముప్పు ప్రాంతాలను ఆదివారం తహశీల్దార్ శైల కుమారి వారి సిబ్బంది పరిశీలించారు. మండలంలోని బురద మడుగు , కారికాడు, వేలుకాడు, మీజూరు గ్రామాలలోని ప్రజలతో ఆమెనేరుగామాట్లాడారు. భారీ వర్షాలకు, వరదలకు లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు. వరద ముప్పు ప్రాంతంలోని సమాచా రాన్ని ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతంలో ఉండే వారిని పునరావాస కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమెతో పాటు ఆర్ఐ ప్రవీణ్ రాయల్, విఆర్ఓ జ్ఞానేంద్ర తదితరులు ఉన్నారు.

## వర్షం కారణంగా గ్రీవెన్స్ రద్దు

**దొరవారిసత్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



బంగాళఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి భారీ వర్షాలు, తుఫాను ప్రభావం ఉందని ముందస్తు జరిగే గ్రీవెన్స్‌డేను రద్దు చేస్తున్నట్లు తహశీల్దార్ శైల కుమారి ఓ ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. దొరవారిసత్రం మండల పరిధిలో గ్రామాల్లో ఉన్న ప్రజలు వారి సమస్యల కోసం ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్‌కు హాజరైయ్యే విషయం తెలిసిందే. అయితే ఈ వర్షాలు కారణంగా ఎవరు కూడా సోమవారం జరిగే గ్రీవెన్స్‌డేకు రావద్దు. ఈ గ్రీవెన్స్‌ను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామని ఆమె తెలిపారు.

## డివి సత్రంలో చిరుజల్లు

**దొరవారిసత్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త** దొరవారిసత్రం మండల పరిధిలోని ఆదివారం సుమారు 11 గంటల సమయంలో ఉరుములు, మెరుపు లతోచిరుజల్లుకురిసింది.సుమారు రెండు గంటల సేపు వర్షం కురవడంతో వాగులు, గుంటలు, కాలు వలు వర్షపు నీటితోనిండాయి. దీనికి తోడు అక్కడక్కడ రైతులు ఈ వర్షపు నీరును పొలాల్లోకి సాగు నీరు కోసం మళ్లించుకుంటున్నారు.

## పల్లె పండుగను విజయవంతం చేయండి

**దొరవారిసత్రం, అక్టోబర్ 13, ప్రభాతవార్త** దొరవారిసత్రం మండల పరిధిలో సోమవారం మినమలమూడి, శ్రీధనమల్లి, మీజూరు, తొగరాముడి పంచాయితీల్లో జరిగే పల్లె పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దొరవారిసత్రం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి పంచాయితీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పల్లె పండుగను కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసే పలు అభివృద్ధి పథకాలను శంఖుస్థాపనకు సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి మండల నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యి విజయవంతం చేయాలని కోరారు.

## లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**చిల్లకూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త** మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద కృష్ణాపురం గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న బండి లక్ష్మయ్య అనే వ్యక్తి అంగళ్ళ వద్ద అడుక్కొని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆదివారం రోడ్డు దాటుతుండగా లారీ అదుపు తప్పి ఢీకొనడంతో ప్రమాదంలో లక్ష్మయ్య కాలు విరిగిపోయింది.ప్రమాదం జరిగిన వెంటనే 108 సహాయంతో చికిత్స నిమిత్తం ప్రాంతంలో తరలించారు. ఎస్ఐసురేష్‌బాబుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీని అదుపులోకి తీసు కోవడం జరిగింది.

# తిరుపతి డివిజన్

## 16న పౌర్ణమి గిరి ప్రదక్షిణం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న సుమారు 22 కిలో మీటర్ల గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు శివభక్తులు వివరించారు. ఈ నెల 16న పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి భారీ ఎత్తున గిరిప్రదక్షిణం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిభక్తుడు హాజరుకావాలని కోరారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల ఏకాంత నసేవ అనంతరం రాత్రి 10గంటలకు పట్టణ నడిబొడ్డులోని బిక్షాల గాలిగోపురం, రాజగోపురంల దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభమౌతుందన్నారు. పౌర్ణమి రోజు శివగిరి ప్రదక్షిణం చేస్తే ఎంతో మేలు కల్గుతుందని గరికపాటి నరసింహారావు ప్రకటించటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 16న నిర్వహించే శివగిరి పాదయాత్రలో హెచ్చుసంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహాకులు కోరారు.

## అమ్మపాళెంలో కుంబాభిషేకం:తొండమాన్‌పురంలో జాతర

### సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జరిగిన ధార్మిక కార్యక్రమాల్లో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. మండలంలోని అమ్మపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన 'మాతమ్మ' ఆలయ కుంబాభిషేకను గ్రామస్థులు నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో స్థానిక సంప్రదాయాలు,శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు. కలశ స్థాపన జరిపారు. వేదమంత్రాలతో పునీతమైన కలశ నీటితో అమ్మవారికి అభిషేకించారు. ఆలయంపై కలశ స్థాపన గావించారు. నాయకులకు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, రఘుకేశవ్‌రెడ్డి, స్వాగతం పలికారు. ఎంఎల్ఏతో పాటు ఉన్నం వాసుదేవనాయుడు, కంఠాఉదయ్‌కుమార్, శ్రీవారి సురేష్, కుమార్ ఉన్నారు.

**పుట్టాలమ్మ జాతరలో పాల్గొన్న నాయకులు:**

శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా జాతరను గ్రామస్తులు ఏర్పాటు చేసారు. ఈ ఆలయానికి తమిళనాడు నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద మహిళలు పొంగళ్ళు పెట్టారు. కోళ్ళను మేకలను గ్రామ దేవతకు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాల్లో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. వారికి గ్రామస్థులు మండల నాయకుడు బర్రెహేమభూషణ రెడ్డి సూచనలతో ఘనస్వాగతం పలికారు. వారితో పాటు నాయకులు పాల్గొన్నారు.

## చల్లపాళెం అంకమ్మకు పొంగళ్ళు

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామంలో వెలసిన గ్రామ దేవత అంకమ్మకు ఆదివారం భక్తి శ్రద్దలతో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల కాలనీ వాసులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తి మండలంలో వెలసిన గ్రామ దేవతలకు పండగల సందర్భంగా విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఈనేపథ్యంలో శ్రీకాళహస్తికి సమీపంలోని చల్లపాళెం గ్రామంలో వెలసిన అంకమ్మకు పంటలు బాగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ పొంగళ్ళు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు గ్రామస్థుల ఆహ్వానం మేరకు సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి గురవయ్య హాజరయ్యారు. మహిళలు పొంగళ్ళు పెట్టి గ్రామ దేవతకు బలులు ఇచ్చారు. సిపిఐ నాయకునికి గ్రామానికి చెందిన యువకులు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

## ఇసుకాసురుల అక్రమార్కులకు ఆర్డీవో చెక్

–పెద్దకనపర్తి నదిలో ట్రెంచ్‌ల ఏర్పాటు

.తొట్టంబేడు, అక్టోబర్ 13 ప్రభాతవార్త



ఇసుకాసురుల అక్రమార్కులకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్పెషల్‌గ్రేడ్ డిప్యుటీ కలెక్టర్ శ్రీకాళహస్తి ఆర్డీవో చెక్‌పెట్టారు. ఇటీవల రాత్రి 11గంటల సమయంలో పూడి సమీపంలో ఉన్న పెన్నలపాడు ఇసుకరీచ్‌కు చెక్‌పెట్టారు. ఎస్ఐ ఈశ్వరయ్యతో కలసి పూడి గ్రామం సమీపం వద్దకు చేరుకుని రాత్రివేళల్లో ఎన్ని ఇసుక ట్రాక్టర్లు వస్తున్నాయో తెలుసుకున్నారు. అయితే ఇక్కడ అనుమతి లేకున్నా సమీపంలోని విరూపాక్షపురం ఇసుకరీచ్ నుంచి ఈమార్గంలో ట్రాక్టర్లు, టిప్పర్లు ద్వారా ఇసుక అక్రమరవాణా ద్వారా గతంలో ఇక్కడ ఉన్న కల్వర్టు కూలిపోయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో మరోసారి పెద్దకనపర్తి సమీపంలో ఉన్న స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని పలువురు పిర్యాదు చేయడంతో ఆర్డీవో ఎస్ఐ ఈశ్వరయ్య, తహశీల్దార్ మధుసూధనరావు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, విఆర్‌ల ఆధ్వర్యంలో ఇక్కడకు చేరుకుని నదిని పరిశీలించారు. పగలు, రాత్రి లేకుండా టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారని గుర్తించారు. దీంతో విషయం తెలుసుకున్న ఆయన వెంటనే జెసిబితో నదిలోకి ఏవాహనం రాకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. అక్రమ ఇసుకరవాణా జరిగే సహించేది లేదని మామూళ్ళమత్తులో అధికారులు కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాలని కోరారు. రాత్రివేళల్లో ఈమార్గంలో ఎక్కువగా ఇసుకఅక్రమరవాణా జరుగుతుందని తన దృష్టికి వచ్చిందని ఇకపై అక్రమరవాణాను చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఆయనతో పాటు పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆర్యవైశ్య తదియారాధన ఒరుగంటి చెంగయ్యశ్రేష్టి సత్రంలో నిర్వహించారు. గ్రామోత్సవం సాయంత్రం చక్కగా ఏర్పాటు చేసారు. అమ్మవారి అలంకారం ఇట్టే ఆకట్టుకునేట్లు తీర్చి దిద్దారు. గ్రామోత్సవం ముందు మేళ తాళాలుతో ముందుకు సాగారు. ముందు కోలాటాలతో కనువిందు చేసారు. ఊరేగింపులో పాలకమండలి గౌరవా ధ్యక్షులు ముచ్చేలి సురేంద్రబాబు, అధ్యక్షులు జూలుగంటి మురళీమోహన్ గుప్తా, ఉపాధ్యక్షులు పేర్ల రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు ఆమూరు రాజేష్‌ల పర్యవేక్షణలో శ్రీ వాసవి యువసేన, శ్రీవాసవి మహిళా మండలి దాతలు ముందుకు సాగగా వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం తేరువీధి, నెహ్రూవీధి, ముత్యాలమ్మగుడి వీధి నగరి వీధి, జయరామారావు వీధి, బజారు వీధుల మీదుగా సాగి ఆలయానికి చేరింది. ఇంటింటి వద్ద అమ్మవారికి హారతులిచ్చారు. నైవేద్యాలు సమర్పించారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండండి..సిఐ

తొట్టంబేడు, అక్టోబర్ 13 ప్రభాతవార్త



వర్షాలకు ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని బుచ్చినాయుడుకండ్రిగ సిఐ తిమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం నేటి నుంచి నాలుగురోజుల వరకు మోస్తారు వర్షాలతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటికే గంగ కాలువలో నీరు నిండగా ఉందని వర్షాలకు కాలువ నిండితే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. గంగ పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తొట్టంబేడు సిఐ , ఎస్ ఈశ్వరయ్య లకు సమాచారం అందించాలని కోరారు.

## భారీ వర్షసూచనలతో అప్రమత్తంగా ఉండాలి.ఎంఎల్ఏ



**.శ్రీకాళహస్తి, అక్టోబర్ 13 ప్రభాతవార్త** భారీ వర్షాలతో నియోజకవర్గ ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీదర్‌రెడ్డి ఓప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 17వ తేదీ వరకు వాతావరణశాఖ భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించడంతో అందరు అప్రమత్తం అవ్వాలని ప్రజలకు ఎంఎల్ఏ సూచించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అగ్నిమాపక, పోలీసు అధికారులకు సూచించారు. ప్రాణ ఆస్తినష్టంసంభవించకుండా అధికారులు ముందస్తు చర్యలుతీసుకోవాలని ఆదేశించినట్లుఎంఎల్ఏ తెలిపారు. మట్టిమిద్దెలు కూలిపోయే ఇండ్లలో ఎవ్వరు ఉండవద్దని తెలిపారు. తాగునీరుకలుషితంకాకుండా ఎంఎల్ఏ తెలిపారు.

## పిచ్చికుక్క స్వైరవిహారం

– మనుషులు, పశువులకు గాయాలు



**పాలసముద్రం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** మండలంలో ఓ పిచ్చికుక్క మనుషులు, పశువులను వెంబడించి కరుస్తోంది. పశువులను రక్షించుకునే ప్రయత్నంలో రైతులు పశువులకు కాపలా కాస్తూ రాత్రి కంటిమీద కునుకు లేకుండా పడి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పిచ్చికుక్క దాడితో పాలసముద్రం పిహెచ్‌సిలో ఈ ఒక్క నెలలోనే సుమారు 70 కేసులు నమోదు అయ్యాయి. ఇప్పటికే ఈ పిచ్చికుక్క బారిన మనుషులు, పశువులతో పాటు ఒక జింక సైతం పడింది. పిచ్చికుక్కను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను పలుమార్లు ప్రజలు కోరినా ఆశించిన ఫలితం దక్కలేదు. పిచ్చికుక్క బారిన పడి మృతి చెందిన పశువులకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఎంపిడిఓ విద్యావతి వివరణ ఇస్తూ మండల పరిధిలో పిచ్చికుక్కలపై ప్రజలు పలుమార్లు తనకు అర్జీల రూపంలో అందించారని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులను చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

### కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం వలన భారీ వర్షాలు కురవనుండడంతో ప్రజలకు సహాయ చర్యలు అందించేందుకు వీలుగా నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కమిషనర్ ఎన్. మౌర్య ఆదివారం తెలిపారు. ఈ కంట్రోల్ రూము నందు 24 గంటలు నగర పాలక సంస్థ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. తుఫాను వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూము నెంబర్ 0877 2256766ను సంప్రదించాలని అన్నారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు ఎక్కువగా కురవనున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి సహాయక చర్యలకైనా కంట్రోల్ రూమును సంప్రదించాలని ప్రజలను కోరారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేశామని, ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి రావొద్దని కమిషనర్ ప్రజలను కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**తిరుపతి విద్య,అక్టోబర్ 13,ప్రభాతవార్త:**



విజయదశమి సందర్భంగా స్థానిక శిల్పారామం ఆవరణలో డాక్టర్ పి సి రాయులు సౌజన్యంతో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ స్థానిక ఉద్యోగస్తులు పర్యాటకులు ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి విజయదశమి అమ్మవారిని పూజించి అనంతరం ఆయన ప్రసంగిస్తూ ప్రతి నెల మొదటి రోజున అన్ని విభాగ మనకు సంబంధించిన డాక్టర్స్ అని డిపార్టె మెంట్స్ పోలీస్ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 150 మంది సభ్యులు మరియు ప్రజలకు బీపి షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి సంబంధించిన సూచనలు సలహాలు డాక్టర్లు ఇప్పించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారిని డాక్టర్ పి సి రాయల్ డి.ఎస్.పి విశ్రాంత డాక్టర్ రెడ్డప్ప డాక్టర్ గోవిందు బీవీపీ అధ్యక్షులు విజయ్ కుమార్ విజయ్ విశ్రాంత ఇన్స్పెక్టర్ నాయుడు ఇంకా పెద్దలు పాల్గొని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమాపతి అమ్మపల్లి నాయుడు ఇంకా మహిళలు పాల్గొని జయప్రదం చేశారు.

## పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక

**వడమాలపేట, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలలో అప్పుడు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. 15 సంవత్సరాల తరువాత అందరూ ఒకచోటికి చేరి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రసంగించారు. అనంతరం తమ ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సన్మానించారు.

## టిటిడి ఎంప్లాయిస్ బ్యాంకు ఎన్నికల్లో పవన్‌ను గెలిపించుకుందాం

### బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



తితిదే కోపరేటివ్ బ్యాంకులో డైరెక్టర్‌గా పవన్‌ని గెలిపించాలని అనేక మంది వక్తలు తిరుపతి విహెచ్‌కె ఫంక్షన్ హాలులో బిసిఈఎఫ్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక సభలో పేర్కొన్నారు. వంకీపురం పవన్ బీసీల తరపున తిరుమల, తిరుపతి దేవస్థానం కోపరేటివ్ బ్యాంక్ ఎన్నికలలో డైరెక్టర్‌గా పోటీ చేయడం బీసీ సమాజానికి గర్వకారణమని, యువకుడైన పవన్ బీసీలకు ఆదర్శప్రాయమని బిసిఈఎఫ్ వ్యవస్థాపకులు గోపాల్ అన్నారు. బిసిఈఎఫ్ సంఘాన్ని బలోపేతం చేయుటకు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ప్రథమ అంకంలోనే రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో బిసిల ఉద్యోగుల ప్రథమ మహాసభ ఏర్పాటు చేయడం విజయవంతం చేయడం, పవన్ యొక్క ప్రతిభకు అది కొలమానమై ఉన్న బిసిఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భట్టా భాస్కర్ అన్నారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం కోపరేటివ్ బ్యాంక్ ఎన్నికలలో కూడా డైరెక్టర్‌గా విజయాన్ని సాధించి టిటిడి బ్యాంకు చరిత్రలో అనేక విజయాలను అతను ఏర్పరచాలని తిరుమల కళ్యాణకట్ట సంఘం గౌరవ అధ్యక్షుడు పెరుమాల్ తెలిపారు. పవన్ టిటిడి బ్యాంకు డైరెక్టర్‌గా విజయం సాధించాలని గాండ్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ అన్నారు. స్వామి వారి నిత్య సేవలోకి ఎప్పటికి అందుబాటులో ఉంటూ, సమాజంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను పెంపొందించడానికి తాను కంకణమై ఉన్నానని వంకీపురం పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్, బిసిఈఎఫ్ నాయకులు మల్లికార్జున, బడి ప్రసన్న యాదవ్, గవ్వల ప్రసాదు, మునికేశవులు, గిరి శ్రీనివాస్, ఒరుగొండ శ్రావణి, బిసి నాయకులు జగన్నాథం, విశ్వనాథం, మురుగన్, రాగరు మునీంద్ర, వెంకటేశ్, బాలకృష్ణ, జానకీరామ్, శేఖర్, రాజా, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నీషియ్ పారామెడికల్ కోర్సుకు ఇంటర్వ్యూలు

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 13, ప్రభాతవార్త**

ఎస్వీ వైద్య కళాశాలలో సోమవారం డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ పారామెడికల్ కోర్స్‌లో మిగిలిన ఒక్క సీటుకు మెరిట్ జాబితా ప్రకారం గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ చంద్రశేఖరన్ తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ నెల 14వ తేది సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎస్‌వి వైద్య కళాశాల ఆఫీస్ నందు సంప్రదించాలన్నారు. కోర్సులో చేరడానికి ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. మరెన్ని వివరాలకు 9440879943 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## వాసవి అమ్మవారి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని బహదూరుపేటలోని ఉప్పువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. విజయదశమి రోజు గ్రామోత్సవం నిర్వహించారు. అలంకారాలు అదిరేటట్లు నిర్వహించారు. ఆదివారం మంగళాభిషేక దేవి అలంకారం జరిపారు. ఉభయదారులుగా విజనపల్లి సత్యనారాయణమ్మ హాజరు కాగా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో ఉత్సవాల ఉభయదారులుగా వ్యవహారించిన వారికి శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి శేష వస్త్రంతో సత్కరించారు. సభ్యులు ముచ్చేలి దామోదరరావు, కుందాంరామమోహన్‌రావు, కొండా ప్రభాకర్‌గుప్తా, ముచ్చేలి నాగేశ్వరరావు, కొండా హరీష్, విజన పల్లి చంద్రశేఖర్, అమరా జనార్ధన్‌రావు తదితరులు ఉభయదారులకు స్వాగతం పలికి సత్కరించారు

## పచ్చాలమ్మ కళ్యాణ మండపానికి రూ.10లక్షల విరాళం

### ఎస్‌సివి ధాతృత్వం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి 8 కిలో మీటర్ల దూరంలోని పల్లమాల సమీపంలో వెలసిన గ్రామ దేవత పచ్చాలమ్మ ఆలయం వద్ద నిరుపేదల కోసం నిర్మించదలచిన కళ్యాణమండపానికి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు రూ.10లక్షలు విరాళాన్ని నిర్మాణ కమిటికి అందించారు. ఆధ్యాత్మిక చింతనకు మారుపేరుగా ఉన్న మాజీ ఎంఎల్ఏ గతంలో కూడా ఏ గ్రామంలో ఆలయం నిర్మించాలన్న తన భాగస్వామ్యం ఉండేది. సుమారు 400 రామమందిరాలు, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలకు ఆయన ఆర్థిక సహాయంతో పాటు ఆలయాల నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను అందించారు. ఆదివారం శ్రీకాళహస్తి–చెన్నై రహదారిలో పల్లమాల చెరువు కట్ట సమీపంలో వెలసిన పచ్చాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అభిషేకాల్లో పాల్గొన్నారు. ఇక్కడ చుట్టుపక్కల గ్రామాలకు సంబంధించిన నిరుపేదల సౌకర్యార్థం ఓ కళ్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి గ్రామస్తులు మండల తెలుగుదేశం నాయకులు కోరగా ఎస్‌సివి నాయుడు స్పందించి రూ.10లక్షలు తన వంతు విరాళంగా అందిం చారు. అంతేకాకుండా కళ్యాణ మండపం నిర్మాణం పూర్తి అయ్యే వరకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన యువతకు దిశ దెశ నిర్దేశం చేస్తూ నేడు సమాజంలోవిలువలుకోల్పోతున్నారన్నారు. మనసంప్రదాయాలు, సంస్కృతి కనుమరుగౌ తుంద న్నారు. ఇది మంచిదికాదన్నారు. మనిషిలోఆధ్యాత్మికచింతనకొరవడినపుడుఆశాంతి చోటు చేసు కుంటుందన్నారు. సృష్టిని భంగపరిస్తే అది మనల్ని ఆటంక పరుస్తుందన్నారు. నేడు ఎక్కడ బడితే అక్కడ లావాలు, వరదలు రావటానికి కారణం ప్రకృతి ధర్మాన్ని విస్మరిస్తున్నాం కాబట్టే అన్నారు. యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు. సుదర్శనం నాయుడు, హరిబాబు నాయుడు, కన్నయ్యనాయుడు, మాజీఎంపిటిసి వీరరాఘవులు, యూనిట్ ఇన్‌చార్జి సురేష్, జి.మునస్వామిచారి, వెంకటకృష్ణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సత్యవేడు ఎమ్మెల్యే సస్పెండ్‌ను ఎత్తివేయాలి

### ఏడు మండలాల ఉమ్మడి పార్టీ నేతలు పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌తో సమావేశం

**కేవీబీ పురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ అధిష్టానం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుసత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలంపై ఉన్న సస్పెండ్ చేసిన విషయం పాఠకులకు విధితమే. హానీ ట్రాపింగ్‌తో ఎమ్మెల్యే ఆదిమూలం హై కోర్టును ఆశ్రయించిన క్లీన్ చీట్ పొందారు. కానీ తెలుగుదేశం పార్టీ సస్పెండ్‌ను ఎత్తివేయకపోవడంతో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు కేవీబీ పురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో గత కొన్ని రోజులుగా పార్టీ అధిష్టానం చేసిన సస్పెండ్‌ను ఎత్తివేసి ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే ఆదిమూలం సేవలను నియోజకవర్గ ప్రజలు పొందుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం కల్పించాలని ఎదురు చూస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి తిరుమల పర్యటకు వచ్చినప్పుడు సైతం ఎమ్మెల్యే తనయుడు కోనేటి సుమన్ కుమార్, అదే విధంగా పిచ్చాటూరు మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, తదితర నేతలు ఎమ్మెల్యే ఆదిమూలం సేవలు నియోజకవర్గానికి ఎంతో ప్రాముఖ్యమని సస్పెండ్ ఎత్తాలని కోరారు. ముఖ్యమంత్రి సైతం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్‌ని సూళ్లూరుపేటలో పార్టీ కార్యాలయంలో కలసి సమావేశం నిర్వహించారు. సస్పెండ్‌ను ఎత్తి ప్రజాసేవ చేయుటకు కృషి చేయాలని గంగాప్రసాద్‌ని నేతలు కోరినట్లు సమాచారం. పారిశ్రామికవేత్త గంగా ప్రసాద్ ఉమ్మడి పార్టీ నేతలకు కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ మంచే జరుగుతుందని అన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తదితరులు గంగా ప్రసాద్‌తో ప్రత్యేక భేటి అయినట్లు సమాచారం. కేవీబీపురం మండల మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, నారాయణవనం మాజీ ఎంపీపీ గోవిందస్వామి, ఉమ్మడి టీడీపీ మాజీ గ్రాడ్యుయేట్ సెక్రటరీ రమేష్, నాగలాపురం మాజీ ఎంపీపీ మురళి, వైస్ మాజీ ఎంపీపీ అంబు, దళిత నేత ఎస్.ఎస్.సురేష్, డా. శేషాద్రి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాదు, అరుణ్ ప్రకాష్, అంబేద్కర్‌నేత రవిచంద్ర, తెలుగు ప్రొఫెషనల్ వింగ్, కేవీబీ పురం మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో రాధారాణిని మర్యాదపూర్వకంగా కలసిన టీడీపీ నేతలు

**కేవీబీ పురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బి.రాధారాణిని తెలుగుదేశం పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలసి శాలువతోసత్కరించారు. సత్యవేడు నియోజకవర్గంలో కేవీబీ పురం మండలం మారుమూల మండలాలు, అదే విధంగా పేదలు ఎక్కువగా ఉన్న మండలమని అందు వలన పేదల అభివృద్ధికి కృషి చేయాలని నేతలు నూతన ఎంపీడీవోని కోరారు. ఉమ్మడి పార్టీ నేతల సహకారంతో అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవోని కలసిన వారిలో మండల పార్టీ కన్వీనర్ బి.రామాంజులనాయుడు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు(రైతు విభాగం) అనపర్తి గోపినాథ్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి(ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్) మనోహర్ సుకుమార్ తదితరులు ఉన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం..న పొంచి ఉన్న ప్రమాదం...!

**కేవీబీ పురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

పారిశుధ్యం, ఆరోగ్యంపై దృష్టి సాధించాల్సిన మండల ఐసీడీఎస్ అధికారులు ప్రచారాలకే తప్ప ఆచరణ మాత్రం పాటించడం లేదు అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. వివరాలు ఇలా... మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళడానికి మార్గం లేక చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారు. చుట్టూ పిచ్చి మొక్కలు మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో పాములు, విష సర్పాలతో సహవాసం చేయాల్సిన దుస్థితి మా పిల్లలకి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి తమ పిల్లలను పంపించాలంటే ఎటు నుంచి ఏ ప్రమాదం పొంచి ఉందో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అంటున్నారు. సమావేశం

## కరాటేలో సత్యవేడు విద్యార్థులు ప్రతిభ

**సత్యవేడు, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



ఆదివారం తమిళనాడు అరణిలో జరిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం మమోరియల్ ద్వితీయ రాష్ట్ర సాయి ఓపెన్ కరటే ఛాంపియన్‌షిప్–24, పోటీల్లో సత్యవేడు విద్యార్థులు జీబీ లక్షిక, నజియా భాను, రిత్విక్ యాదవ్‌లు అన్నింట ప్రథమ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం, ట్రోఫిని కైవసం చేసుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన రిత్విక్ యాదవ్ సత్యవేడు మెయిన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థులు కరాటే మాస్టర్ భువనేష్ పర్యవేక్షణలో శిక్షణ పొంది ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు, కరాటే నిర్వాహకులు విద్యార్థులను ప్రథమస్థానంలో నిలిచిన కరాటే మాస్టర్ భువనేష్‌లను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పోర్ట్స్ కరాటే అకాడమి ప్రెసిడెంట్ 7వ డాన్ బ్లాక్ బెల్ట్ ఎం.కె.శివకుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పరందామన్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో శ్రీ మానసాదేవి అమ్మవారు

**పుత్తూరురూరల్, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయంలో దేవి శ్రీ నవరాత్రి ఉత్సవాలు శనివారం విజయదశమితో ముగిసింది. ఈ సందర్భంగా సేమానసాదేవి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవిఅలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలోని శ్రీ వినాయక స్వామి, శ్రీ మానసాదేవి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ నాగాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం శ్రీ మానసాదేవి అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, ప్రసాదాలు అందించారు.

## వైభవంగా దసరా ఉత్సవం

**విజయపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



మండలంలోని శరన్నవరాత్రి పురస్కరించుకుని శనివారందసరాఉత్సవంవైభవంగానిర్వహించారు. మండలంలోని పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వర స్వామి ఆలయంలో, జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో, విజయపురం మిట్టూరులో రాజరాజేశ్వరి ఆల యంలో, పాతార్కాడులో రామరాల యంలో, మహా రాజపురంలో విఙ్ఞేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జగన్నాథపురం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పురో హితులు బాలసుబ్రహ్మణ్యశర్మ, రాంప్రసాద్‌శర్మ, వందవాసి మహేష్‌శర్మ, పలువురు గ్రామస్తు లు పాల్గొన్నారు.

## నేటి నుంచి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

**విజయపురం, అక్టోబరు 13 ప్రభాతవార్త:**

నేడు సోమవారం నుంచి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లుఎంపీడీవో రమణప్రకాష్ పేర్కొన్నారు. నేడు సోమవారం 14 నుంచి ఈ నెల 20 వరకు జరుగుతుందన్నారు. 14న సోమవారం ఉదయం 7 గంటలకు ఇళ్ళత్తూరులో రూ.2.6 లక్షలు, 9 గంటలకు విజయపురంలో రూ.4లక్షలు, 10 గంటలకు ఆలపాకంలోరూ.2.2 లక్షలు, 10.30 గంటలకు కాళికాపురం బీసీ కాలనీలో రూ.4 లక్షలకు, క్షూరికాపురంలో రూ.1.4 లక్షలు, 11 గంటలకు కేవీ పురంలో రూ.4.8 లక్షలు, 11.30 గంటలకు గంగమాంబాపురం రూ.3 లక్షలకు, పోతురాజులు కండ్రిగలో రెండు పనులకు రూ.6.4 లక్షలు, మధ్యాహ్నం 12 గంటలకు తెల్లగుంటలో రూ.3.6 లక్షలకు, 16న ఉదయం 7 గంటలకు మాధవరంలో రెండు పనులకు రూ.2.4 లక్షలు, 10.30 గంటలకు మల్లారెడ్డి కండ్రిగలో రెండు పనులకు రూ.3.8 లక్షలు, గొల్లకండ్రిగ దళితవాడలో రూ.4 లక్షలు, 17న ఉదయం 11 గంటలకు బూచివానత్తం దళితవాడలో రూ.5.2 లక్షలు, 18న 10 గంటలకు విజయపురం దళితవాడలో రూ.2.48 లక్షలు, 11 గంటలకు పాతార్కాడులో రూ.8 లక్షలు, జంబాడలోరూ.2 లక్షలు, మధ్యాహ్నం 12 గంటలకురూ.1.8, పాత మహారాజపురంలో దళితవాడలో రూ.3.12 లక్షలు, 19న ఉదయం కళియంబాకంలో రూ.4.8 లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీల కోసం భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రసన్న వదనంతో కటాక్షించిన శ్రీ కట్టపుట్టాలమ్మ

**రేణిగుంట, అక్టోబరు 13 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం కరకంబాడిలోనిండుగా కొలువు దీరిన శ్రీ కట్ట పుట్టాలమ్మ తల్లి శనివారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసన్న వదనంతో శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉద యం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు. శ్రీ నాగాలమ్మ పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆల య వంశపార్యంపర్య ధర్మకర్త కురకాలువ రామ చంద్ర య్య కుమారుడు కురకాలువ వాసి ఉద యం నుంచి ఆలయం వద్ద ఉండి పూజా రులతో అమ్మ వారి కి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. నవ రాత్రి 9 రోజులు అమ్మ వారు అవతారంలో భక్త లకు దర్శనమిచ్చారు. 10వ రోజు అమ్మతల్లి శ్రీ రాజరాజేశ్వరిదేవిగాకటాక్షించారు. ప్రతిసంవత్స రంఇలాగేదేవినవరాత్రులునిర్వహిస్తామనివంశపార్యంపర్యధర్మకర్త తెలియ జేశారు.

## శ్రీ యాకారమ్మ ఉత్సవాలలో డాలర్స్ దివాకర్‌రెడ్డి



**తిరుపతిరూరల్, అక్టోబర్13 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ పెరుమాళ్ళపల్లిలో వెలసిన శ్రీ యాకారమ్మ ఉత్సవాలలో పూలంగి సేవ దాత డాలర్స్ గ్రూప్ చైర్మెన్ దివాకర్‌రెడ్డి పాల్గొ న్నారు. శ్రీయాకారమ్మ (ఏకాంబరేశ్వరి) అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. చివరిరోజున సిం హ వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త పెద్దమంగారి గౌతమి గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

# కాణిపాకంలో ఘనంగా శమిపూజ, గ్రామోత్సవం

## -ముగిసిన దసరా ఉత్సవాలు



కాణిపాకం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం, శమిపూజ, గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈనెల 3 నుండి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగా చివరిరోజు విజయదశమి సందర్భంగా ఆలయంలో శ్రీమరగదాంభిగా అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం, శమిపూజ, గ్రామోత్సవం నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి కుటుంబీకులు ఉభయదారు లుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు వరుస ఉభయద తీసుకురాగా ఆలయ అర్చకులు ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమరించారు. అనంతరం అమ్మవారిని మహిసాసుర మర్ధినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయ ంత్రం ఆలయంలో సామూహిక కుంకుమార్చన, శమిపూజ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలాగే రాత్రి అమ్మవారిని అలంకరించిన ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయాద్యాల నడుమ గ్రామోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఇదిలా వుండగా ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టువద్ద ఉదయం శమిపూజ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ పట్టెం గురుప్రసాద్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# అంకమ్మ తల్లి ఉత్సవం.. పులకించిన భక్తజనం

కోట, అక్టోబర్ 13 ప్రభాతవార్త : కోట మండలం సిద్ధవరం గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అంకమ్మ తల్లికి 108 మంది ముత్తయిదువులు 108 గుమ్మడి కాయలతో నైవేద్యం సమర్పించారు. దువ్వూరు ధ్రువకుమార్‌రెడ్డి ఆయన సతీమణి జాహ్నా ఉభయకర్తలుగా వ్యవహరించారు. మంగళ వాయిద్యాలు, కళాకారుల గీతాలాపనలు, హోరెత్తించిన డిజె పాటలు, యువత నృత్యాలు, బాణాసంచా మోతలు, డప్పులు దరువుల మధ్య సిద్ధవరం గ్రామంలో సందడి నెలకొంది. అంకమ్మ తల్లిని దర్శించుకునేందుకు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



# ఆలయం వద్ద రాజకీయ ఘర్షణ...బాహాబాహి నేతలు

## పాతకక్షలతో పరస్పర దూషణలు!



శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త : జనం అందరూ దసరా సంబరాలు చేసుకుంటూ అమ్మవారిని భక్తిశ్రద్దలతో మొక్కుకుంటుండగా మాజీ మున్సిపల్ చైర్మెన్ ముత్యాల పార్థసారధి మాజీ కౌన్సిలర్ భర్త పులి రామచంద్రయ్యలు ఘర్షణ పడ్డారు.ఈ అంశం సంచలనం సృష్టించింది. ఇరు వర్గాలు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. సిఐ వెంకటేశ్వర్లు ఇరువురి ఫిర్యాదులను పరిశీలిస్తు న్నారు. ముత్యాల పార్థసారధి మున్సిపల్ చైర్మెన్‌గా ఉన్న సమయంలో పులి రామచంద్రయ్య సతీమణి కౌన్సిలర్‌గా ఉన్నారు.గత ప్రభుత్వంలో నాయకులు ఓ బార్‌ను నడిపారు.ఈ లావాదేవిల్లో పార్థసారధికి పులి రామచంద్రయ్యకు ఆర్థిక లావాదేవిల్లో వివాదాలు చోటు చేసుకున్నాయి.ఈ పంచాయతీ జరుపుటకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వద్దకు పార్థసారధి వెళ్లగా పార్టీ కండువా వేసుకుంటే పరిష్కరిస్తామంటూ చేర్చుకొని చివరకు పరిష్కరించలేదు. దాంతో పార్థసారధి సొంత గూడు తెలుగుదేశం లో చేరారు.పులి రామచంద్రయ్య వార్డులో చామండేశ్వరి ఆలయం ఉంది. గతంలో రామచంద్రయ్య ఈ ఆలయ నిర్వహణను చూసే వారు. కొంత కాలం క్రితం ఈ ఆలయానికి కొత్త కమిటి ఏర్పడింది. ఈ ఆలయానికి పార్థసారధి ఎంతో కాలంగా పూల విరాళం ఇచ్చే వారని ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పార్థసారధి ఆయన సతీమణి అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం కమిటి పిలుపుమేరకు దర్శనానికి వెళ్ళగా ఆలయం వద్ద పులిరామ చంద్రయ్య ఆయన సతీమణి కుమార్తెలు అడ్డుకున్నారని దుర్భాష లాడారని పాతకక్షలతో తనపై దాడికి పాల్పడ్డారని ముత్యాల పార్థసారధి పోలీసులకు ఫిర్యాదు చేసారు.కాగా సారధి ఆయన అనుచరులు తమపై కర్రలతో దాడి చేసారని పులి రామచంద్రయ్య టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## శివయ్యసేవలో బాలకృష్ణ సతీమణి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో విజయదశమి సందర్భంగా సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుం ధర పూజలు జరిపించుకున్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాడు. ఈ నేపధ్యంలో బాలకృష్ణ సతీమణి రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి తెలుగు దేశం మహిళలు స్వాగతం చెప్పారు.ఆలయం తరపున కార్యనిర్వహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ సారధ్యలో స్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం ఆమెకు వేదపండితఉలతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను ఆలయ ఇఓ చంద్రశేఖర్ ఆజాద్,డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ లు పర్యవేక్షించారు. తెలుగుదేశం నాయకులు కన్నలి ప్రతాప్,నాగమల్లి దుర్గా ప్రసాద్, కృష్ణవేణి, సుమతమ్మ తదితరులు స్వాగతం పలికారు.

## ఓం శక్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, అక్టోబర్13 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నగర్ కాలనీ వెలసిన శ్రీశక్తి దేవాలయంలో అమ్మవారికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఓం శక్తి భక్తుల ఆహ్వానం మేరకు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో శ్రీకలస దీప చక్ర హోమాన్ని ఓం శక్తి భక్తులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో జరిగిన సుమంగళి పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులకు పూజారి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఓంశక్తి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు కలశాభిషేకం...కుంభం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో దశమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పది రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు.ఈ ఏడాది ఆలయంలో మహిళా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఈ ఏడాది పట్టణంలోని పలువురు మహిళలు 'భవానీ దీక్ష'ను పాటిస్తూ మాల ధరించారు.భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు జరిపారు.ప్రతి రోజూ అమ్మవారికి దీపారాధన నిర్వహించారు.ప్రతి రోజూ వేకువ జాము నుంచి అమ్మవారికి సహస్రనా మార్చన సమర్పించారు. మొదటి రోజు ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన గావించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు.ఆదివారం పూజారి తులశీ శర్మ పూజలు జరిపారు.అమ్మవారికి షోడషాభిషేకాలు జరిపారు. సంప్రదాయ బద్దంగా ఆలయంలో అమ్మవారికి 'కుంభం' ఏర్పాటు చేసారు. తరువాత విశేష అలంకారాలు జరిపారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు,మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ పూజారి తులసి శర్మ, చెంగల్‌రాయులు, పరిచారకులు గోవిందశర్మ దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## షిరిడీగా మారిన రేణిగుంట



రేణిగుంట, అక్టోబరు 13 ప్రభాతవార్త: విజయదశమి పర్వదినం పురస్కరించు కుని శనివారం రేణిగుంట జీఎం వీధిలోకొలువైన సాయిబాబా గుడిలో షిరిడి సాయిబాబా సేవా సమితి నిర్వహించిన కార్యక్రమాలు మరో షిరిడిని తలపించింది. 1918 అక్టోబరు 15 తేదీ షిరిడి సాయిబాబా మహా సమాధి చెందారు. ఆయన మహా సమాధి చెందిన రోజు విజయదశమి కావడంతో విజయదశమి నాడు ఆయన సమాధి స్థితిని వేడుకగా జరపడం ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో వేకువ జామున 5.30 గంటల నుంచి బాబాకు ఆలయ నిర్వాహకులు పూజారులతో ప్రత్యేక అభిషేకాలు, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు. షిరిడి సాయిబాబా సేవాసమితి సభ్యులు సాయిబాబా, అప్పట్లోసాయిబాబాతో తిరిగిన ఆయన శిష్యులు, భక్తుల, వేషధారణలలో రేణిగుంట పట్టణంలో ఊరేగడం భక్తులకు, పుర ప్రజలకు సాయిబాబా కాలం నాటి రోజుల్లో వెళ్లిన అనుభూతి కలిగించారు. మధ్యాహ్నం వేలాది మందికి సాయిబాబా అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం సాయిబాబా పారాయణం, భజన జరిగాయి. సాయి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# సోషల్ మీడియా అడ్మిన్‌లపై చర్యలు తీసుకోండి..!

## టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి




చంద్రగిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త: సోషల్ మీడియా అడ్మిన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆదివారం ఎస్ఐ అనితకు ఫిర్యాదు చేశారు. గత కొంత కాలంగా నిరాధార ఆరోపణలతో అర్ధహిత వార్తలను సోషల్ మీడియాలో పెడుతూ రాక్షస ఆనందం పొందుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆమె కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను జిరాక్స్‌లు తీసి ఎస్ఐకి అందజేశారు. రోజూవారీ కూలీ పనులకు వెళ్ళే వారికి డబ్బులు ఆశ చూపించి గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టిస్తున్నట్లు ఆరోపించారు. నిరాధార ఆరోపణలకు పాల్పడిన వారికి (మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డిపై మినహా) నోటీసులు పంపించి స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని, లేని పక్షంలో మీడియా సమక్షంలో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మా తాత హయాంలోనే 100 ఎకరాలు కలిగివున్నట్లు మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఉద్దేశించి తెలిపారు. నా తండ్రి పోలీసు డిపార్ట్‌మెంట్ పనిచేశారనీ జీతం తప్ప అవినీతికి పాల్పడలేదన్నారు. నా భర్త పులివర్తి నాని మేనమామ గ్రానైట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా విదేశాలకు ఎగుమతి చేయడంతో పాటు చైనాకు వెళ్ళిన మొదటి గ్రానైట్ యజమాని అని గుర్తు చేశారు. అయితే కేవలం రూ.7 వేలకు జనచైతన్యలో పనిచేసిన మీకు వందలు, వేల కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో మట్టి, ఇసుక, భూముల్లో మీరు చేసిన అవినీతి మరకలు మాకు అంటించాలని చూస్తున్నారంటూ దుయ్య బట్టారు. ఓటమి నుండి తేరుకుని మళ్ళీ ఎదగాలని, మాపై నిరాధార ఆరోపణలతో మీరు చేస్తున్న కృషికి ఆల్‌దిబెస్ట్ చెప్పారు. 2024 ఎన్నికల ప్రచారంలో తాను ప్రతి కుటుంబాన్ని పలకరించిన నేను ఆయా గ్రామాలలో ప్రజల అవసరాలపై సమస్యలను నోట్ చేసుకున్నట్లు తెలిపారు. 2025 జనవరి సంక్రాంతి అనంతరం తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించి, ఎంఎల్ఏ పులివర్తి నాని చొరవతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. నన్ను అవమానించడమే లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నాలకు ఆల్ ది బెస్ట్ చెబుతూ నన్నున్న చంపాలనుకున్నా చంపుకో అంటూ తేల్చిచెప్పారు. చంద్రగిరి పేరు ఉచ్ఛరించే అర్హత లేదంటూ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సింగు సుధ, ఏజి పల్లి బాల, కొండూరు ప్రవీణ్ రాయల్, వీరంగారి రమేష్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, గౌస్‌భాషా, శానంబట్ల తులసి రెడ్డి, ముడిపల్లి సురేష్ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, కన్నయ్య నాయుడు, మండలం లోకేష్ రాయల్, ఉగ్రాణం గురునాధం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



చిల్లకూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని ఓడూరు గ్రామంలో నూతనంగా ప్రారంభిసునతన్న గాయత్రి మెరైన్ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పరిశ్రమ ప్రారంభమైతే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మహిళలు, పురుషులు ఈ పరిశ్రమలో పనిచేయుటకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు నాగరాజు, గంటా మధు కృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, జడ్పిటిసి మన్యం శీనయ్య, గ్రామ సర్పంచి నాగిశెట్టి శారద, జోనల్ మేనేజర్ సత్యనారాయణ, ఫీల్డ్ జనరల్ మేనేజర్ వెంకటేశన్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో భారీగా వాహన పూజలు

### -కిక్కిరిసిన వాహన పూజామండపం



కాణిపాకం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: విజయదశమి సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్ర, శనివారాల్లో వాహనపూజలు భారీగా జరిగాయి. నూతన వాహనాలను కొనుగోలు చేసిన వ్యక్తులు ఆవాహనాలను మొట్ట మొదటగా విఘ్ననాయకుడైన గణనాధుని చెంత పూజలు నిర్వహించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసంతో పూజలు నిర్వహిస్తుంటారు. అలాగే విజయదశమి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తమ ద్విచ క్రవాహనాలు, కార్లు, వ్యాన్లు, ఆటోలు, లారీలు తదితర వాహనాలను తీసుకువచ్చి కాణిపాకంలో పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో వాహనాలను తీసుకువచ్చి భక్తులు పూజలు నిర్వహించుకున్నట్లు తెలుస్తోంది. దీనితో కాణిపాకంలోని వాటర్ సర్వీసు సెంటర్లు సైతం వాహనాలతో కిక్ క్రిసాయి. అలాగే పూజల నిమిత్తం వచ్చిన వాహనాలు వాహనపూజా మండపంలో బారులు తీరాయి.పూజల కోసం భక్తులు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో వాహన పూజా మండపంలో అదనపు అర్చకులు, సిబ్బందిని ఆలయ అధికారులు నియమించి వాహనాలకు త్వరితగతిన పూజలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే వాహన పూజా మండపం వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాహన పూజలు కోసం వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి రావడంతో ఆలయంలో భక్తులు రద్దీ నెలకొంది.

## చింతలగుంటలో జల్లికట్టు పోటీలు



వెదురుకుప్పం, అక్టోబర్ 13 ప్రభాతవార్త : మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయితీ పరిధిలోని చింతలగుంటలో దసరా పండుగ పురష్కరించుకుని ఆదివారం పశువుల పందెల పోటీలను నిర్వహించారు. అల్లె వద్ద గిత్తలను పోటీలకు వదలడంతో యువకులు ఉత్సహంగా బరిలోకిదిగి చెక్కపట్టీల కోసం కుస్తీపడ్డారు. దసరా పండుగను పురష్కరిం చుకుని గిత్తల కుస్తీ పందెలను గ్రామస్తులు నిర్వహించారు.చింతలగుంటకు చెందిన యువకులు గ్రామంను రంగు పేపర్లు, మాడితోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. రైతులు తమ కోడిగిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి వివిధ అంకరణతో ముస్తాబు చేయడంతో పాటు కొమ్ములకు తమ ఇష్టామైన రాజకీయ నాయకులు, దేవుళ్ళ, సినిమా హిరోల చిత్రాలతో కూడిన చెక్కపట్టీలను కట్టించి అలంకరించారు.కొందరు రైతులు గిత్తలకు టవల్, నగదు బహుమతులు కట్టి పోటీకి దించారు. అల్లె వద్ద కుస్తీకి సిద్దమైన యువకులు ఉత్సహంతో ఊలలు, కేరింతల నడుమ పౌరుషంతో పోటీలకు దిగడంతో గ్రామస్థులు గిత్తలను వదలి పెట్టారు. చెక్కపట్టీల కోసం యువకుల మధ్య ఘర్షణలు తోపులాటలు జరిగాయి.

## గణనాధుని సేవలో జిల్లా జాయింట్ కలెక్టర్



కాణిపాకం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, ఐరాల మండల రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండపై గంగమ్మ కొలువై ఉన్నారు...!

### -దేవస్థానానికి ఐఎస్ఓ గుర్తింపు



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 13 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కొలవుతీరి వున్నారన్న భక్తుల నమ్మకాన్ని గుర్తిస్తూ అమ్మవారి ఆలయానికి ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఓ) గుర్తింపు నిచ్చింది. ఈమేరకు ధృవీకరణ పత్రాన్ని ఐసిఎల్ సంస్థ ఇఓ ఉపకమీషనర్ ఏకాంబరంకు అందించారు. అటవీ ప్రాంతంలో కొండపై వున్న గంగమ్మ ఆలయానికి విశేష చరిత్ర వుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతోన్న అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలను పుష్పము అడుగుట ద్వారా నివృత్తి చేసుకొంటున్నారు. అదే విధంగా ఆలయంలోని అమ్మవారి పవిత్ర తీర్థాలను పంటలు, ఇళ్ళల్లో చల్లుట వల్ల చీడ, పీడల నుంచి రక్షింపబడుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుతం దేవస్థానం ఉప కమీషనర్ హోదాలో సేవలందిస్తోంది. హిందూ ధర్మాన్ని ఆచరించి, అమ్మవారిపై భక్తులకున్న నమ్మకాన్ని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ ఐసిఎల్ సంస్థ సిఇఓ రామలక్ష్మి, సభ్యుడు సాయి శ్రీనివాస్‌లు ఐఎస్ఓ ధృవీకరణ పత్రాన్నందించారు. దీంతో అమ్మవారి ఆలయంలో పుష్పమడుగుట గురించి దిశ దశలా వ్యాప్తి చెందుతుందని భక్తులంటున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



చిల్లకూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామ పంచాయితీలో వున్న అమరావతి హోటల్‌లో పనిచేస్తున్న మేనేజర్ మదు రెడ్డి అనే వ్యక్తి శనివారం రాత్రి హోటల్ నుండి ఇంటికి వెళ్లే క్రమంలో బైక్ పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఎస్ఐ సురేష్ బాబు సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాల తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన మధురెడ్డికి కొడుకు, కుమార్తె ఉన్నారు. మృతి చెందిన మధు రెడ్డి గత 40 సంవత్సరాలు నుండి చెన్నైలోనే సవేరా హోటల్, అమరావతి హోటల్‌లో మేనేజర్‌గా పనిచేసి మంచి గుర్తింపు ఉన్న వ్యక్తి హోటలకు వెళ్లిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే వారు అని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గంటామోహన్‌పై సత్వరం సస్పెన్షన్ ఎత్తివేత

### - ఏఐటియుసి అనుబంధ సంఘ నాయకులు డిమాండ్




చిత్తూరు, అక్టోబర్ 13 ప్రభాతవార్త: ఉపాధ్యాయ సమస్యలు, హక్కులు, వారి సంక్షేమం కోసం జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజును నిలదీసిన రాష్ట్ర ఎస్టీయు నాయ కులు గంటామోహన్ సస్పెన్షన్‌ను సత్వరం ఎత్తివేయాలని ఏఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయు కార్యాలయంలో ఆదివారం ఏఐటియుసి అనుబంధ సంఘాల నాయకులు కె.రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ గంటామోహన్ సస్పెన్షన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి బేషరతుగా ఎత్తివేయాలని లేకుంటే ఏఐటియుసి అనుబంధ సంఘాలతో దశల వారీగా డిఇఓ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సివస్తోందని హెచ్చరించారు. డిఇఓ దేవరాజు వద్దకు ఉపాధ్యాయులు అర్జీ రూపంలో సమస్యలు తీసుకెళ్తే సరిగా స్పందించడం లేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలను డిఇఓ దృష్టికి తీసుకెళ్ళకూడదా! ప్రశ్నించకూడదా! నిలదీయకూడదా! ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా! అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య పద్దతుల్లో ఉపాధ్యాయుల సమస్యలను నిజాయితీగా ప్రశ్నిస్తున్న గంటామోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆదేశించాలన్నారు.

## వెంటనే కొత్త సబ్ రిజిస్టర్ కార్యాలయం నిర్మించండి




పాకాల, అక్టోబర్ 13 ప్రభాతవార్త : పాకాల మండల కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయానికి చుట్టు పక్కల ఉన్న ఆరు మండలాల ప్రజలు నిత్యం రిజిస్ట్రేషన్ల కొరకు పాకాలలో ఉన్న సబ్ రిజిస్టర్ ఆఫీసుకి వస్తుంటారు. ఇక్కడ ప్రతి నిత్యం కోట్లాది రూపాయల భూముల క్రయ విక్రయాలు జరుగుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కోట్ల రూపాయిలు ఆదాయం సమాకూరుతోంది. ఈ కార్యాలయ పరిధిలో ఆరు మండలాలలో ప్రతి పంచాయితీకి సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు కట్టించిన గత ప్రభుత్వం సబ్ రిజిస్టర్ నూతన కార్యాలయం నిర్మించడంలో విఫలమైంది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు, నిత్యం ఇక్కడికి రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే మహిళలు గాని మహిళ ఉద్యోగులకు కనీసం, టాయిలెట్ సౌకర్యం లేకపోవడం వలన తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రజల నుంచి 7.5 శాతం వసూలు చేసే ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పనలో గత ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమైనాయని ప్రజలు అంటున్నారు. ఇకనైనా స్థానిక ఎంఎల్ఏ పులివర్తి నాని దీనిపై దృష్టి సారించి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో నూతనంగా భవన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.